


ఐదు కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కొమరాడ

ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంతం కూనేరు చెక్ పోస్ట్ వద్ద బుధవారం రాత్రి పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. రాయగడ వైపు నుంచి వస్తున్న ఒక ప్రైవేట్ బస్సులో గంజాయిని తరలిస్తుండగా పోలీసులకు ఒక వ్యక్తి పట్టుబడినట్లు తెలుస్తుంది. ఈనెల 5న కూడా మూడు కిలోల గంజాయితో ఇద్దరు మైనర్లు పట్టుబడిన విషయం తెలిసిందే. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేపట్టారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి

నాడు అసమ్మతి రాగం నేడు మౌనగీతం



- రాజాంలో కిమిడి కళావెంకటరావు అనుయాయులు, గ్రామ స్థాయి నుంచి అభ్యర్థి కోండ్రు మురళి రాజకీయాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి /రేగిడి

నాడు అసమ్మతి రాగం తీసిన గ్రూపు నేడు మౌన గీతం పాడుతోంది. ఈ గ్రూపును పెంచిపోషించిన నాయకుడికి అసెంబ్లీ టిక్కెట్ విషయంలో ఆశాభంగం కలిగింది. ఈ పరిణామాలు జరుగుతుండగానే ఎమ్మెల్యే అభ్యర్థి గ్రామస్థాయి రాజకీయాలు ముమ్మరం చేసుకున్నారు. దీంతో, ఢీలాపడ్డ అనుయాయులు స్తబ్ధతగా ఉన్నారు. మండల స్థాయి నాయకులు ఒకవైపు, పార్టీ గ్రామ స్థాయి కేడర్ మరోవైపు అన్నట్టుగా ఉంది. ఈ పరిస్థితి ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో... అన్న ఆసక్తితో జనంతోపాటు రాజకీయ పరిశీలకులు చర్చించు కుంటున్నారు. ఇదీ రాజాం నియోజకవర్గంలో ప్రస్తుతం టిడిపి పరిస్థితి.

జిల్లా పునర్విభజనలో భాగంగా రాజాం నియోజకవర్గం శ్రీకాకుళం నుంచి విజయనగరం జిల్లాలోకి మారిన విషయం విధితమే. టిడిపి తరపున మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్‌తోపాటు మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి కుమార్తె గ్రీష్మ కూడా టిక్కెట్ ఆశించారు. ఇదే నియోజకరవ్గంలో నివాసం ఉంటున్న మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు తిరిగి ఎచ్చెర్ల అసెంబ్లీ టిక్కెట్ ఆశించారు. రాజాంలో కోండ్రుకు, ఎచ్చెర్లలో బిజెపి అభ్యర్థి ఎన్ఇఆర్‌కి కేటాయించడంతో అటు గ్రీష్మ, ఇటు కిమిడి కంగుతిన్నారు. ఇదే అనుమానంతో ప్రతిభా భారతి తొలి నుంచీ కోండ్రుకు దూరంగా ఉంటూ వచ్చారు. ఆమె గ్రూపునకు గతంలో ఇదే నియోజకవర్గం నుంచి మంత్రిగా పనిచేసిన కిమిడి ఆనుయాయులు కూడా తోడయ్యారు. సుమారు ఆరు నెలల క్రితం నుంచి రాజాంలో కోండ్రు, ప్రతిభా భారతి శిబిరాలు వేర్వేరుగా సాగాయి. తొలి నుంచీ కిమిడికి ఆనుయాయులుగా ఉన్న వంగర మండలం మాజీ ఎంపిపి పైలా వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు ఉదయాన మురళి, సంతకవిటి మండలానికి చెందిన మాజీ ఎంపిపి కొల్లా అప్పలనాయుడు, కిమిడి రామకృష్ణం నాయుడు రాజాం మండలానికి చెందిన కేశవరావు ప్రతిభా భారతి గ్రూపులో ఉన్నారు. వీరంతా భారతి నాయకత్వంలో కోండ్రును వ్యతిరేకిస్తూ రహస్య సమావేశాలు నిర్వహించారు. ఒకానొక సందర్భంలో కోండ్రును బాహాటంగానే విమర్శించారు. ఈ వ్యవహారాల వెనుక కిమిడి హస్తం ఉందనే చర్చ కూడా నడిచింది. ఏం జరిగినా కిమిడి చూసుకుంటారనే భావనతో వీరంతా ఉండేవారు. అనూహ్య పరిణామాల నడుమ కిమిడి కళా వెంకటరావు ఆశించిన ఎచ్చెర్ల అసెంబ్లీ టిక్కెట్ చేజారిపోవడంతో రాజాంలోని ఆనుయాయ గ్రూపు గప్ చప్ అన్నట్టు స్తబ్ధ వాతావరణంలోకి వెళ్లింది. మొన్న కోండ్రును వ్యతిరేకించి, నిన్న అసమ్మతి రాగం తీసిన ఈ నాయకులంతా ప్రస్తుతం నోరు మెదపడం లేదు. తమ నేతలిద్దరికీ టిక్కెట్లు రాకపోవడంతో కొద్దిరోజులుగా మౌనంగా ఉంటున్నారు. ఇదే విషయమై భారతి, కిమిడి సంయుక్త గ్రూపునకు చెందిన నాయకులను ప్రజాశక్తి పలకరించగా పార్టీకి వ్యతిరేకంగా ఉండలేం కాదా.... అంటూనే ఇంకా కోండ్రుతో ప్రచారానికి వెళ్లలేదు కాదా? అంటూ సందిగ్ధ ప్రశ్నలు సంధిస్తుండడం గమనార్హం. మరోవైపు ఈ గ్రూపుల పోరుపై జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకత్వం కూడా దృష్టిపెట్టినట్టుగా కనిపించడం లేదు.

నాయకులను పట్టించుకోని కోండ్రు

తొలి నుంచీ వ్యతిరేకిస్తున్న నాయకులను కోండ్రు ఏమాత్రం లెక్కచేయడం లేదు. గడిచిన రెండు నెలలుగా గ్రామ టిడిపి స్థాయి నాయకులతో మమేకమై ముందుకు సాగుతున్నారు. గతంలో కాంగ్రెస్‌లో పనిచేసిన అనుభవంతో నేటి ప్రత్యర్థిపార్టీలోని వారిని కూడా ఆకర్షిస్తూ పార్టీలోకి లాగే కార్యక్రమం నెలరోజులుగా సాగుతోంది. జనం ఆయన వెంట ర్యాలీ అవుతున్నప్పటికీ, మండల స్థాయి నాయకులు ఆటంకాలు సృష్టిస్తే కోండ్రు వ్యూహం నెరవేరుతుందా? అన్నది ప్రశ్న. ఎన్నికలకు మరో 45రోజులు సమయం ఉన్న నేపథ్యంలో ఇటువంటి చిక్కులు ఉన్నచోట అధిష్టానం దృష్టిపెట్టి సరిచేస్తుందని మరికొంతమంది విశ్లేషిస్తున్నారు. పరిణామాలు ఎలా మారుతాయో వేచి చూడాల్సిందే.

పాలకొండలో అభివృద్ధి జాడేది?

- విద్య, వైద్య రంగాల్లో వెనుకబాటు
- పాలకులకు పట్టని సమస్యలు



ప్రజాశక్తి-పాలకొండ

పేరుకే నియోజకవర్గం... అభివృద్ధి శూన్యం... సమస్యల నిలయం... నియోజకవర్గంలో విద్య, వైద్యం సౌకర్యాలు అంతంతమాత్రమే. ఉపాధిలో పూర్తిగా వెనుకబాటు. పాలకులు మారినా పాలకొండ అభివృద్ధికి నోచని పరిస్థితి.

పాలకొండ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరానుంది. ముఖ్యంగా పట్టణ పరిధిలో అభివృద్ధి శూన్యం. ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. నియోజకవర్గం విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పూర్తిగా వెనుకబడింది. గత పాలకులతో పాటు, ప్రస్తుత ప్రభుత్వం హయాంలో కూడా అభివృద్ధికి ఆమడదూరంగానేఉంది. విద్య, వైద్య రంగాలతో పాటు నియోజకవర్గంలో ఉపాధి కల్పనకు కనీసం ఒక్క పరిశ్రమ కూడా లేని దౌర్భాగ్యంలో పాలకొండ ఉంది. ఉన్నత విద్య అయిన పిజి, ఇంజినీరింగ్ కళాశాలలు కూడా లేని పరిస్థితి. ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు పక్క జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం పాలిటెక్నిక్ కళాశాల కూడా లేని దౌర్భగ్య పరిస్థితి. వైద్యరంగం పరిస్థితులు కూడా అలాగే ఉన్నాయి. పేరుకే వంద పడకల హాస్పిటల్ అని ఉంది కానీ, అత్యవసర కేసులను కనీసం చూడకుండా వెంటనే జిల్లా హాస్పిటల్‌కు రిఫర్ చేస్తున్నారన్న చెడ్డ పేరు మూట కట్టుకుంది. పాలకొండ పట్టణంలో ఉండాల్సిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సీతంపేటకు తరలించారు. అయితే అక్కడ కూడా ఈ ఆసుపత్రి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఇక్కడ ఉన్న ఏరియా హాస్పిటల్‌లో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో రోగులు పక్క జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



స్టేడియం అభివృద్ధి కాకపోవడంతో బయట ఆడుతున్న క్రీడాకారులు

ఉపాధి రంగానికి వస్తే.. కనీసం ఒక్క పరిశ్రమ కూడా లేకపోవడంతో నిరుద్యోగ యువత ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అదే విధంగా మినీ స్టేడియం నిర్మించి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామని పాలకుల హామీ నేటికీ నెరవేరలేదు. ఇది ఎప్పుడు పూర్తవుతుందోనని ఎవరూ చెప్పలేరు. పర్యాటక రంగంలో పాలకొండ వెనుకబడి ఉంది. రాష్ట్రంలోనే అత్యధికంగా పన్నులు వసూలు చేస్తారనే పేరు ఉన్న పాలకొండ నగరపంచాయితీలో మౌలిక సదుపాయాలు మాత్రం ఆ స్థాయిలో ఉండవని ప్రజలు పెదవి విడుస్తున్నారు. రాష్ట్రంలోనే ప్రజల కోసం కనీసం ఒక పార్క్ కూడా లేని మునిసిపాలిటీగా పాలకొండ పేరు తెచ్చుకోవటం దారుణం. పట్టణంలో ఉన్న వెంకటరాయుని కోనేరును పార్క్‌గా తీర్చిదిద్దుతామని పాలకులు ప్రతిసారి ఇస్తున్న హామీ ఇక్కడ ప్రజలకు వినడం అలవాటైపోయింది. అదే వెంకటరాయుని కోనేరు విశ్రాంత ఉపాధ్యాయులు అయిన సాహిణి ప్రసాదరావు మాస్టర్ సహకారంతో అక్కడ ఒక గ్రంథాలయం, ఆలయం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. కేవలం ఆయన వల్ల కోనేరుకు ఒకవైపు అయినా అభివృద్ధి జరిగిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. అలాగే పట్టణంలో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతుంది. ప్రధాన రహదారిని 120 అడుగులకు విస్తరిస్తామని పాలకులు ఎప్పటి నుంచో చెప్తున్నా ఇప్పటికీ కనీసం ఆచరణకు నోచుకోకపోవడం శోచనీయం. దీనివల్ల విపరీతంగా ట్రాఫిక్ పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, రాజకీయ నాయకులు ఇచ్చిన హామీలను భవిష్యత్తులోనైనా ఆచరణలోకి తీసుకొ వస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.



ఒడిశా అధికారులను నిలదీస్తున్న గంజాయిభద్ర గ్రామ గిరిజనులు

విద్యుత్ మీటర్ల ఏర్పాటు ఒడిశా అడ్డగింత

గంజాయిభద్రలో ఘటన

ప్రజాశక్తి - సాలూరు

కొటియా గ్రామాల్లో ఒడిశా అధికారులు, పోలీసుల దౌర్జన్యాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. కుక్క తోక వంకర అన్న చందంగా ఒడిశా వంకర బుద్ధి మారడం లేదు. గురువారం వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒకటైన గంజాయిభద్రలో ఇళ్ల కు విద్యుత్ మీటర్ల బిగింపునకు విద్యుత్ సిబ్బంది వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న కొటియా పోలీసులు అక్కడకు చేరుకుని విద్యుత్ మీటర్ల బిగింపును అడ్డుకున్నారు. పొట్టంగి సమితి అధికారులు అక్కడికి చేరుకుని విద్యుత్ మీటర్ల ఏర్పాటు చేయొద్దని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మీటర్లు బిగించి వద్దని వారు ఆదేశించారు. అంతేకాక విద్యుత్ మీటర్లు వున్న ఆటోను కొటియా పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో సాలూరు మండలానికి చెందిన విద్యుత్ సిబ్బంది సబ్ డివిజనల్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై గంజాయి భద్ర మాజీ సర్పంచ్ గెమ్మెల భీషు ఒడిశా పోలీసులు, అధికారులను నిలదీశారు. గ్రామంలో ఇళ్లకు విద్యుత్ మీటర్లు లేక చాలా కాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఒడిశా వారు చేయరు, చేస్తున్న ఎపి సిబ్బందిని అడ్డుకోవడం తగదని వాదించారు. దీనిపై ఎడిఇ రంగారావును వివరణ కోరగా గంజాయిభద్రలో ఇళ్లకు విద్యుత్ మీటర్ల ఏర్పాటు చేస్తుండగా కొటియా పోలీసులు అడ్డుకున్నారని చెప్పారు.దీనిపై తమ ఉన్నతాధికారులకు నివేదించామని చెప్పారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పి

ప్రజాశక్తి - కురుపాం/గుమ్మలక్ష్మీపురం

రానున్న సార్వత్రిక ఎన్నికలు-2024లో భాగంగా ఎస్పి విక్రాంత్ పాటిల్ ఎల్విన్పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఒడిశా సరిహద్దు గ్రామాలైన లడ్డ, కొందుకుప్ప, సమస్యాత్మక గ్రామమైన చింతలపాడు పోలింగ్ స్టేషన్ల భవనాలను సందర్శించి వాటి స్థితి గతులు, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకొని తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కురుపాం మండలంలోని ములిగూడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. నాటుసారా, గంజాయి అక్రమ రవాణా అరికట్టే భాగంగా వాహన తనిఖీ నిర్వహిస్తూ చెక్‌పోస్ట్ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్విన్ పేట సిఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ బి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం : లడ్డలో పోలింగ్ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పి

వాహనాలను విస్తృత తనిఖీలు చేపట్టాలి

పాచిపెంట : అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్‌ల వద్ద వాహనాలను విస్తృత తనిఖీలు చేయాలని ఐటిడిఎ పిఒ, ఆర్ఒ విష్ణుచరణ్ ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని పి.కోనవలస అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్, పద్మాపురం చెక్ పోస్ట్‌లను ఆయన పరిశీలించారు. చెక్ పోస్ట్‌ల వద్ద ఉన్న మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. చెక్ పోస్ట్‌ల మీదుగా వెళ్లే వాహనాలను నిశితంగా తనిఖీలు చేయాలని ఎఫ్ ఎస్పి బృందం, పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. తనిఖీ చేసిన ప్రతి వాహనం వివరాలను రిజిస్టర్‌లో పొందుపర్చాలని సూచించారు. అనంతరం సాలూరులో నిర్మాణంలో ఉన్న ఆర్అండ్‌బి అతిథి గృహాన్ని పరిశీలించారు. పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పది రోజుల్లో అందజేస్తామని ఇఇ వేణుగోపాలరావు చెప్పారు. ఆయన వెంట ఆర్అండ్‌బి డిఇ సుబ్బారావు, జెఇ విజయ్ కుమార్ వున్నారు.



పాచిపెంట : చెక్‌పోస్టు రికార్డులను పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

సీతానగరం : మండలంలోని అంటిపేట వద్ద సైన్ స్క్వాడ్ వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఇ.చిన్నారావు మాట్లాడుతూ అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాలు తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. వాహనాల ద్వారా అక్రమంగా ఎటువంటి వాటిని తీసుకువెళ్లడానికి లేదని అలా తీసుకెళ్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారునాయుడుకు పతంజలి పురస్కారం

ప్రజాశక్తి -విజయనగరం కోట



ప్రముఖ రచయిత, వివిధ దినపత్రికల సంపాదకులుగా పనిచేసి తన రచనలతో అక్రమాల సమాజాన్ని ఎండగట్టిన కీర్తిశేషులు కెఎన్‌వై పతంజలి పేరున ప్రతిఏటా అందజేసే రాష్ట్ర స్థాయి పతంజలి పురస్కారం ఈ ఏడాది పార్వతీపురం పట్టణానికి చెందిన రచయిత రౌతు బంగారు నాయుడుకు అందజేయనున్నామని కెఎన్‌వై పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి బాబ్జీ, ఎన్. కె.బాబు ప్రకటించారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రౌతు బంగారు నాయుడు రచయితగానే కాకుండా గడచిన 20ఏళ్లుగా ఎలక్ట్రానిక్ మీడియాలో కంటెంట్ హెడ్‌గా విధులు నిర్వహిస్తున్నారన్నారు. మే 17న విజయనగరంలో జరిగే కార్యక్రమంలో పురస్కారం ఆయనకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. బంగారు నాయుడు పేరును పురస్కార ఎంపిక కమిటీ ప్రతినిధులు సీనియర్ పాత్రికేయులు విఎంకె లక్ష్మణరావు, భళ్లమూడి నాగేంద్ర ప్రసాద్, రచయిత ఎన్‌కె బాబు సూచించారని బాబ్జీ తెలిపారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా పురస్కార ప్రధాన కార్యక్రమాన్ని మే 17కు మార్చినట్టు తెలిపారు. గడచిన పదేళ్లుగా పతంజలి పేరిట పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు పిడకల ప్రభాకరరావు, జలంత్రి రామచంద్ర రాజు, తాడేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎన్‌విబిఎస్‌డి రాష్ట్ర ఉపసంచాలకులు రామనాధరావు

మలేరియా ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పాచిపెంట/సాలూరురూరల్

జిల్లాలో మలేరియా ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారించాలని ఎన్‌విబిడిసి రాష్ట్ర ఉప సంచాలకులు ఎటి రామనాధరావు అన్నారు. ఎన్‌విబిడిసి రాష్ట్ర ఉప సంచాలకులు జిల్లాలో గురువారం పర్యటించారు. తోణాం, పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మలేరియా, డెంగీ మొదలగు జ్వరాలు నమోదు వివరాలు, నిర్ధారణ పరీక్షలు, అందజేస్తున్న చికిత్సా వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఎమ్-3, ఎమ్ఎఫ్-7 ల్యాబ్ రికార్డులను పరిశీలించి నివేదికలు స్పష్టంగా ఉండాలని ల్యాబ్ సిబ్బందిని ఆదేశించారు. జ్వర లక్షణాలతో ఆసుపత్రికి వచ్చిన వారికి రక్తపూతలు సేకరించాలన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఫీవర్ సర్వలెన్స్, ఫోకల్ స్ప్రేయింగ్ తదితర నివారణ చర్యలు చేపడుతున్న తీరుపై క్షేత్రస్థాయి సిబ్బందిని ఆరా తీశారు. వ. ఆ ప్రాంతంలో జ్వర నిర్ధారణ సామూహిక రక్త పరీక్షలు నిర్వహించి, దోమల వ్యాప్తి నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా రామనాధరావు మాట్లాడుతూ జిల్లాలో మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కువగా దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వలెన్స్ చేపట్టాలని తద్వారా మలేరియా, డెంగీ జ్వరాలు త్వరితగతిన గుర్తించి, చికిత్స అందజేయడం, అదేవిధంగా దోమల వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టడం తదితర కార్యచరణ ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. తద్వారా రానున్న వర్షాకాలంలో జ్వరాలు ప్రబలకుండా అదుపులో ఉంటాయన్నారు. శాఖల సమన్వయంతో జిల్లా, మండల స్థాయి సమావేశాలు నిర్వహించి దోమల వ్యాప్తి నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత అంశాలపై సమీక్షలు జరపాలన్నారు. డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పర్చాలన్నారు. జిల్లాలో దోమల మందు స్ప్రేయింగ్‌కు ఎంపికైన 401 గ్రామాల్లో మొదటి విడత స్ప్రేయింగ్ మే15 నుంచి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, ఎఎంఒలు సూర్యనారాయణ, డివి రమణ, జిల్లా విబిడి కన్సల్టెంట్ రామచంద్ర, వైద్యాధికారులు డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ సుజాత, సబ్ యూనిట్ అధికారి ఈశ్వరరావు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

నూతన వరి వంగడాలు సాగు చేయాలి : ఎడిఎ

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు పాత వంగడాల స్థానంలో కొత్త వరి వంగడాలను పరిశీలనాత్మకంగా రాబోయే ఖరీఫ్ సీజన్లో సాగు చేయాలని వ్యవసాయ శాఖ సహాయసంచాలకులు మధుసూదనరావు తెలిపారు. మండలంలోని పెద్దచీపురువలస, శ్యామల గౌరీపురం గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఒకే రకమైన రకాన్ని సాగు చేయడం వల్ల విత్తనం నాణ్యత తగ్గి పంట దిగుబడులు తగ్గిపోతుందన్నారు. కావున కాబట్టి రాబోయే ఖరీఫ్‌కు ఆర్‌జిఎల్ 25 37, ఎంటియు 70 26 బిపిటి 32 91 రకాలను విడనాడి వాటి స్థానంలో ఎంటియు 13 18, ఎన్ టి యు 1271 వంటి రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. భూసారం నానాటికీ క్షీణిస్తుందని, భూమిని ఇప్పటి నుంచే బాగు చేసుకోవాలని, భూమిలో సేంద్రియ కర్బన్ పెరగాలంటే తప్పనిసరిగా పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని పూతదశలో కలియదున్నుకోవాలని తెలిపారు. రైతులు ఎక్కువగా రసాయన ఎరువులపై ఆధారపడకుండా సేంద్రియ ఎరువులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సేంద్రియ, రసాయన ఎరువులను సమతూకంలో వినియోగించుకోవాలన్నారు. అప్పుడే నేల ఆరోగ్యంగా ఉండి ఆరోగ్యవంతమైన పంట పండుతుందని తెలిపారు. మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ మారుతున్న నూతన సాంకేతికతతో తయారు చేసిన నానో యూరియా, డిఎపి వాడుకుంటే శ్రమ తగ్గడమే కాకుండా ఖర్చు కలిసి వస్తుందని తెలిపారు. నానో ఎరువులను పురుగుల మందులతో కలిపి పిచికారి చేసుకోవడం వల్ల పురుగుల మందుల పనితనం పెరుగుతుందన్నారు. కావున రైతులు రాబోయే ఖరీఫ్‌కు నానో ఎరువులపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ వినోద్‌కుమార్, నాగమణి, రైతులు పాల్గొన్నారు



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఎడిఎ మధుసూదనరావు



డిఆర్ఒకు వినతిని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురంలో ఐటిఐ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

డిఆర్ఒకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో ఐటిఐ చదువుతున్న విద్యార్థులకు పరీక్షా కేంద్రం లేకపోవడం అన్యాయమని వెంటనే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డిఆర్ఒ జి.కేశవనాయుడుకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం పండు మాట్లాడుతూ ఐటిఐ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న సందర్భంలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, సాలూరు, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట ప్రాంతాల్లో ఐటిఐ చదువుతున్న విద్యార్థులు రాజాం, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లి పరీక్షలు రాసే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీనివల్ల విద్యార్థులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విద్యాసంవత్సరంలో జులై చివరి వారంలో జరుగుతున్న పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పార్వతీపురం జిల్లా కేంద్రంలో గల జ్యోతి ఐటిఐ (ప్రైవేట్) కళాశాలలో సుమారు 500 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేందుకు సరిపడా తరగతి గదులు, కంప్యూటర్లు, ల్యాబ్‌లు, అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. కావున అధికారులు ఆ కాలేజీని పరిశీలించి విద్యార్థులకు అందుబాటులో ఉన్న స్థానిక జ్యోతి ఐటిఐ (ప్రైవేట్) కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు టి.అఖిల్, జిల్లా కమిటీ సభ్యులు పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



నిరసన తెలుపుతున్న వేతనదారులు

ఉపాధి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధిహామీ కూలీలకు బకాయి పడ్డ బిల్లులను వెంటనే చెల్లించాలని, ఉపాధిహామీ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేసి, అవినీతికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని గుజ్జువాయి పంచాయతీ బొరామణిగూడ వద్ద ఉపాధి హామీ వేతనదారులతో కలిసి గురువారం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు ఊలక వాసుదేవరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పత్తిక రామయ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఈశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి పనులు చేసిన 14 రోజులకే బిల్లులు చెల్లించాల్సి ఉన్నా పనులు చేసిన వేతనదారులకు నేటికి ఆరువారాలైనా వేతనాలు ఇవ్వలేదన్నారు. కనీసం గిట్టుబాటు వేతనం కల్పించడం లేదన్నారు. అలాగే జిల్లాలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేసి పనులు జరిగే చోట టెంట్లు, మంచినీరు, మజ్జిగ వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకొని పనిచేసే చోట మెడికల్ కిట్లు ఏర్పాటు చేసి గుణపాలు, పారలు పంపిణీ చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొండగొర్రె దసురు, బాలయ్య, కూలీలు పాల్గొన్నారు.



గిరిజనులకు హైజనిక్ కిట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ ఛైర్మన్ శ్రీరాములు

గిరిజనులకు హైజనిక్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో నివసిస్తున్న గిరిజనులకు వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్యంపై అవగాహన కల్పించేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా హైజనిక్ కిట్లను పంపిణీ చేస్తున్నామని ఛైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు అన్నారు. మండలంలోని మారుమూల గిరి శిఖర గ్రామాలైన కేసర, నెల్లికొత్త, కేసరగూడలో 60మంది గిరిజనులకు హైజనిక్ కిట్లు, టార్పాలిన్లను గురువారం పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా గిరిజనులకు వ్యక్తిగత పారిశుధ్యం పై అవగాహన కల్పించామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇటువంటి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నామని ప్రజలు తమ రెడ్‌క్రాస్ సొసైటీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ పైడా కొండలరావు, జిల్లా కో-ఆపరేటర్ వి. శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు బేత కుమారస్వామి, బి.వెంకటరమణ, టిటిడిఎ సభ్యులు రామారావు, నాగరాజు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న వీరేష్‌చంద్రదేవ్

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - కురుపాం

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ అన్నారు. గురువారం కురుపాంలోని మూడు రోడ్ల జంక్షన్ బస్టాండ్, సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రానికి ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తూ వెళ్తుంటారని, కావున వేసవిలో వారి దాహార్తిని తీర్చేందుకే ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, మండల కన్వీనర్ కెవి కొండయ్య, టిడిపి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి - సాలూరురూరల్

నియోజకవర్గ కేంద్రమైన సాలూరులో గల భవిత కేంద్రం ఆవరణలో గురువారం విద్య సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఎంఇఒ ఆ.విజయ్ కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా విభిన్నసామర్థ్యాలైన విద్యార్థులకు అందిస్తున్న సేవలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సహకారాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాలూరు ఏరియా ఏంటి స్పెషలిస్ట్ డాక్టర్ లుక్ నాయక్ విద్యార్థులను పరిశీలించి వారికి అవసరమైన ఉపకరణాలను గురించి సమాచారం తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా సమన్వయకర్త భానుమూర్తి, సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల ఎంఇఒలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

సువిధ యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల్లో రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సమావేశాలపై సువిధ యాప్‌పై ప్రజలకు అవగాహన ఉండాలని స్థానిక తహశీల్దార్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి రాజకీయ పార్టీ ముందస్తు అనుమతులు, సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతులు 48 గంటల్లో ముందుగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఈశ్వరరావు, ఎస్సై ఎం రాజేష్ పాల్గొన్నారు.

పులిగుమ్మిలో ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని పులిగుమ్మిలో కొత్తగా నిర్మించిన షిరిడి సాయిబాబా మందిరంలో బాబా మందిరాన్ని గురువారం ప్రతిష్టించారు. ధార్మాదివాసం కార్యక్రమాలు కలదివలస షిరిడి సాయి ఆశ్రమ సాయి సేవకుల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమాలలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు శుక్ర, శనివారాలు కూడా కొనసాగుతాయని మందిర నిర్వాహకులు తెలిపారు.

సామాజిక బాధ్యతతో సేవలందించా

ఎల్ఐసి యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాస



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తన 39ఏళ్ల ఉద్యోగ జీవితంలో సామాజిక బాధ్యతగా భావించి సేవలు అందించానని ఎల్ఐసి విజయనగరం బ్రాంచ్ లో అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన మాంగిపూడి శ్రీనివాస తెలిపారు. ఈనెల 28న ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన ఉద్యోగ జీవితం గురించి వివరించారు.

తల్లితండ్రులు మంగిపూడి కామేశ్వరి, సూర్యనారాయణ మూర్తి. నాకు నలుగురు అక్క చెల్లెళ్లు. తండ్రి స్వస్థలం విశాఖ జిల్లా చోడవరం. మా అమ్మగారి స్వస్థలం విజయనగరం. భార్య శశికళ పూసపాటిరేగ మండలం రెల్లివలస జెడ్‌పి హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఇద్దరు పిల్లలు, కుమారుడు శరత్ చంద్ర బెంగుళూరులో పిడబ్ల్యుసి సంస్థలో సీనియర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. కుమార్తె సింధూర ఢిల్లీ లోని మహిళా హార్డింగ్ మెడికల్ కాలేజీలో ఎమ్‌డి చేస్తోంది.

ఒరిస్సా రాష్ట్రంలోని ఇబ్ అనే గ్రామంలో 1964 మార్చి 28న జన్మించాను. తండ్రి రైల్వేలో పనిచేసేవారు. తల్లి గృహిణి. తండ్రి రైల్వేలో పని చేయడం వలన 5వ తరగతి వరకు విద్యాభ్యాసం ఇంటి దగ్గరే జరిగింది. హైస్కూల్ విద్యను విజయనగరం బిపిఎం హైస్కూల్, ఇంటర్, డిగ్రీ ఎంఆర్ డిగ్రీ కాలేజీలో చదివాను. ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ చేస్తుండగా ఎల్ఐసిలో అసిస్టెంట్‌గా ఉద్యోగ వచ్చింది. 1985 మే 1న ఉద్యోగంలో చేరాను. 3 నెలలు ట్రైనింగ్ అనంతరం 1985 ఆగష్టు 1న ప్రొబిషనరీ అసిస్టెంట్‌గా పలాసలో జాయిన్ అయ్యాను. అక్కడ పనిచేస్తుండగా పలాస ఎల్ఐసి బేస్ యూనిట్ కార్యదర్శిగా ఎన్నికయ్యాను. కార్యదర్శిగా చేస్తూనే ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ కో ఆర్డినేటర్ కమిటీ కన్వీనర్‌గా పని చేశాను. 1986 డిసెంబర్ 2 న విజయనగరం బ్రాంచ్‌కు బదిలీపై వచ్చాను. నా 38సంవత్సరాల 10 నెలలు సర్వీస్ లో 37ఏళ్ల 3 నెలలు విజయనగరం బ్రాంచ్ లోనే సర్వీస్ పూర్తి చేశాను. విజయనగరం బ్రాంచ్‌లో యూనిట్ కార్యదర్శిగా, ఐసిఇయు డివిజన్ ఉపాధ్యక్షులుగా, ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా బాధ్యతలు చేపట్టాను. ఈ క్రమంలోనే ప్రభుత్వ రంగ పరిరక్షణ, ప్రజాతంత్ర ఉద్యమాలకు ఆకర్షితుడినై సమ సమాజ స్థాపన ధ్యేయంగా కృషి చేశాను.

విజయనగరం జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించాను. సిఐటియు అఖిల భారత కౌన్సిల్ సభ్యులుగా కూడా ఉన్నాను. ఉమ్మడి రాష్ట్రంలో జ్యూట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించాను. ప్రస్తుతం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నాను. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. సిఐటియు ప్రధాన బాధ్యతలో ఉన్నప్పుడు ఫేకర్, జ్యూట్, వెరా లేబొరేటరీస్, భీమసింగి షుగర్స్ తదితర కంపెనీల్లోను, షాప్ ఎంప్లాయిస్, అంగన్వాడీ, మున్సిపల్, ఎలక్ట్రిసిటీ తదితర రంగాలలో యూనియన్‌లు ఏర్పాటు కావడంలో ముఖ్యభూమికను పోషించాను. ఈ యూనియన్‌లు చేపట్టిన ముఖ్యమైన పోరాటాల్లో కీలకమైన బాధ్యతలు వహించడం మరచిపోలేనిది.

తల్లిదండ్రుల ఆశీస్సులు, కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగుల సహాయ సహకారాలు, ఎఐఐఇఎ నాయకుల మార్గనిర్దేశంతో ఎల్ఐసిలో 39 సంవత్సరాల సర్వీసును విజయవంతంగా పూర్తి చేసుకుని రిటైర్డు అయ్యాను. వీరందరి సహకారంతోనే ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం, నమ్మిన సిద్ధాంతం కోసం కార్మిక, ప్రజా ఉద్యమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఇదంతా సామాజిక బాధ్యతగానే చేపట్టాను. ఉద్యోగ జీవితంలో సహకారం అందించిన ఉద్యోగులకు, కార్మిక రంగ ఉద్యమాల్లో సహకరిస్తున్న ప్రజా సంఘాలు, సిపిఎం నాయకులకు, నాకు అన్ని విధాలుగా అండగా ఉన్న కుటుంబ సభ్యులకు అభినందనలు. ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక బాధ్యతగా ప్రజలకు సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తాను.

జగన్ ఆరోపణలు హాస్యాస్పదం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

బాబాయ్ వైఎస్ వివేకానందారెడ్డి హత్య కేసులో టిడిపి పాత్ర ఉందని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వాఖ్యానించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బాబాయి హత్య కేసులో కడప ఎంపి అవినాష్ రెడ్డి ప్రమేయం ఉందని సిబిఐ చార్జిషీటు దాఖలు చేసి నిందితులను అరెస్టు చేస్తే వారిని పక్కన పెట్టుకుని వివేకానందరెడ్డి హత్య కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రమేయం ఉందని, సునీత, షర్మిలను ఆయనే ఉసిగొలుపుతున్నట్లు బహిరంగ సభలో సిఎం వాఖ్యానించడం రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అబద్ధాలు అలవోకగా ఆడే ఆయన మనస్తత్వం గురించి ప్రజలకు పూర్తిగా తెలుసని అన్నారు. అలాగే గురువారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుకు హైకోర్టులో స్వల్ప ఊరట లభించేలా ఆదేశాలు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో అచ్చెన్నాయుడుపై తొందరపాటు చర్యలు వద్దని హైకోర్టు ఆదేశించిందని, ఈ కేసులో అచ్చెన్నాయుడ్ని సీఐడీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే నిందితునిగా చేర్చారని అన్నారు. ఈ కేసు కూడా ఆయన నిర్దోషిగా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సక్రమంగా పింఛన్లు పంపిణీ చేయాలి

వీరఘట్టం : లబ్ధిదారులకు సక్రమంగా పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక బాధ్యత వహించాలని ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం వెల్ఫేర్ సహాయకులకు ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదు చూసుకోవాల్సిన బాధ్యత మీదేనన్నారు. సకాలంలో పనిచేసి అందరికీ పింఛను అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి టివిఆర్ మూర్తి, సీనియర్ సహాయకులు ఎం.నాగభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు...

ప్రజాశక్తి - సాలూరురూరల్

వ్యవస్థలో, విధానాల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే రాబోయే ఎన్నికల్లో తాము ఘనవిజయం సాధిస్తామని సాలూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. తన నివాసంలో పట్టణ సమన్వయ సమావేశం గురువారంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవస్థలను సర్వం నాశనం చేసిన వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, ప్రజలు టిడిపిపై ఆదరణ చూస్తే తెలుస్తుందని అన్నారు. యువతకు కావాల్సిన నమ్మకాన్ని భరోసాను ఈ ప్రభుత్వం కల్పించలేదని అన్నారు. రాష్ట్రాన్ని అప్పులమయం చేశారని, ఒకటో తారీఖు నాటికి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలోనూ, కనీసం పెన్షన్దారులు కూడాను జీతాలు సమయానికి ఇవ్వలేని దుస్థితి దాపురించిం దని విమర్శించారు. ఈ ఎన్నికల్లో తమను ఆదరిం చాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు వైకుంఠపు హర్ష, కూనిశెట్టి బీమారావు, మజ్జి చిరంజీవి, కొనిస చిన్ని, అల్లు అప్పయ్యమ్మ, బలగ రాధ, బలగ పైడ్రాజు, నూతి రాజేశ్వరి, అశోక్ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

కొమరాడ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిళ్లు దగ్ధమైంది. మండలంలోని చినకేర్జిలలో కాండ్రేకుల రవికుమార్ ఇంట్లో శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో గ్యాస్ లీక్ అయ్యి పూరిళ్లు పూర్తిగా కాలిపోయింది. గ్యాస్ లీక్ అయిన వెంటనే షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడిదంతో ఆ ఇంటిలో ఉన్న గృహోపకరణాలు, విలువైన వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు రవికుమార్ తెలిపారు. భూముల పాసుపుస్తకాలు, పాన్, ఆధార్ కార్డులు, సుమారు రూ.2లక్షల నగదు బూడిదయ్యాయి. అయితే రాత్రిపూట ఆరు బయట పడుకోవడంతో ఎవరికీ ప్రాణ నష్టం జరగలేదు.

నీటిఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మున్సిపాల్టీకి సంబంధించి తోటపల్లి బూస్టర్ పంప్ హౌస్‌ను కమిషనర్ గురువారం మున్సిపల్ డిఇ కిరణ్ కుమార్, ఎఇ ఆనంద్‌తో కలిసి సందర్శించారు. అక్కడ ఉన్న నాలుగు ఇన్‌ఫిల్టరేషన్ బావులను పరిశీలించి రాబోయే వేసవి దృష్ట్యా నీటి సామర్థ్యం నిల్వ ఉండేలా నదిలో ఇసుక బస్తాలతో బండ్ ఏర్పాటు చేసి నీటిని ఊట బావుల వైపు మళ్లించి నీరు ఇంకేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ఈ వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకావాలని, అదనంగా కావాల్సిన నీటి సేకరణకు ప్రణాళికలు తయారు చేయాల్సిందిగా మున్సిపల్ డిఇ, ఎఇకి సూచించారు.



నీటినిల్వల కోసం ఏర్పాటు చేస్తున్న బండ్‌లను పరిశీలిస్తున్న కమిషనర్

తాగునీటి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి

తాగునీటి సరఫరా జరిగే తీరుపై వార్డు సచివాలయాల ఎమినిటీ సెక్రటరీలు ప్రత్యేక పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ సూచించారు. బుధవారం కమిషనర్ చాంబర్లో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతోనూ, 15వ వార్డు సచివాలయాల ఎమినిటి సెక్రటరీలతోనూ తాగునీటి సరఫరాపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎమినిటీ సెక్రెటరీలతో మాట్లాడుతూ, వేసవి దృష్ట్యా పట్టణ ప్రజలు తాగునీటి సరఫరా జరుగుతున్న సమయంలో పర్యవేక్షించాలని, పైపు లైన్లలో లీకులను గుర్తించేందుకు పర్యవేక్షించాలని, మీమీ వార్డు పరిధిలో మరమ్మతైన చేతి బోర్లును గుర్తించి ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేయాలని అన్నారు. క్లోరినేషన్ పరిశీలిస్తున్న తీరును కూడా పర్యవేక్షించాలని, వేసవి దృష్ట్యా పట్టణ ప్రజలకు తాగునీట సరఫరాలో ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా తెలియజేసేందుకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలన్నారు. దీన్ని పట్టణ ప్రజల సద్వినియోగం చేసుకోనేలా 15వ వార్డు సచివాలయాల్లో ఉన్న ఎమినిటి సెక్రటరీలు ఆయా వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న స్థానికులకు తెలియజేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డిఇ కిరణ్ కుమార్, సచివాలయ ఎమినిటి సెక్రటరీలు పాల్గొన్నారు.

గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - సాలూరు

రానున్న ఎన్నికల్లో వైసిపిని మళ్లీ గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి చెప్పారు. గురువారం ఆమెతో పాటు వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, జెసిఎస్ కన్వీనర్ కళ్లేపల్లి త్రినాధ్‌నాయుడు మండలంలోని బోరబంద సచివాలయం పరిధిలో ఉన్న తెంటుబొడ్డవలస, దేవుబుచ్చింపేటలో ఇంటింటికి తిరిగి డిప్యూటీ సిఎం రాజన్నదొర నాయకత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. వైసిపి అధికారంలోకి రాకపోతే సంక్షేమ పథకాలు ఆగిపోయే అవకాశం ఉందని చెప్పారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ప్రభుత్వం తమదేనని చెప్పారు. రాజన్నదొరను మరోసారి ఆదరించాలని కోరారు. మరిపిల్లిలో మండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన సీనియర్ నాయకులు సువ్వాడ రామకృష్ణ, పెద్దింటి మాధవరావు, కె.పోలినాయుడు, ఎంపిటిసి సభ్యులు జన్ని సీతారాం ఇంటింటికీ తిరిగి అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు.



సాలూరు : బోరబందలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

పార్వతీపురంరూరల్ : మండలంతో పాటు పట్టణంలో వైసిపి అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని వెంకంపేట మున్సిపాలిటీ పరిధిలోని 23, 24 వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ఐదేళ్లుగా తాను చేసిన సేవలను వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో తనకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి తీళ్ల కృష్ణారావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని పూతికవలస, మర్రిపాడు, చిన్నబగ్గ, కీసరజోడు పులిపుట్టి పంచాయతీల్లో స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదల కోసంఅనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన తమ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జడ్పీటీసీ ప్రతినిధి సవర రాము, వైస్ ఎంపిపిలు, జేసీయస్ కో - ఆర్డినేటర్ గేదెల కోటేశ్వరరావు (ఎంపిటిసి), చిన్నబగ్గ ఎంపిటిసి ఊయిక మంగయ్య, పూతికవలస సర్పంచ్ ప్రతినిధి సవర సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిపై కోడ్ ఉల్లంఘన కేసు

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్రపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదైంది. పట్టణంలోని నవిరి కాలనీలో ఎటువంటి అనుమతులు లేకుండా ఈనెల 25న కరపత్రాలు పంపిణీ చేసినట్లు ఫిర్యాదందిందని ఎన్నికల అధికారి కె.హేమలత తెలిపారు. ఈ ఫిర్యాదుపై విచారణ అనంతరం విజయచంద్రతో పాటు మరో 10మందిపై పార్వతీపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఇండిపెండెంట్ అభ్యర్థి గేదెల రామకృష్ణ

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ సమస్యలపై తనకు పూర్తిగా అవగాహన వుందని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఇండిపెండెంట్ అభ్యర్థి గేదెల రామకృష్ణ చెప్పారు. గురువారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జనసేన టికెట్ ఆశించి ఆ పార్టీలో తాను చేరానని, అయితే పార్టీ ఏవిధమైన దిశానిర్దేశం చేయకపోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సహకారశాఖ అధికారిగా ఈ ప్రాంతంలో ఎక్కువ కాలం పని చేశానని, ఇక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన వుందని చెప్పారు. గిరిజన గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, అందుబాటులో ఉన్న జలవనరులను, సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధిని విస్మరించాయని చెప్పారు. కాలువల్లో పూడికతీత పనులు కూడా జరగలేదని చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఇంకా గిరిజనులు పూరి గుడిసెల్లో నివసిస్తున్న పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాలు అన్ని ప్రభుత్వాలు అమలు చేస్తాయని, అభివృద్ధి పనులు జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. తాను ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్నందున అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలని రామకృష్ణ కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పారినాయుడు, ఎన్.అప్పారావు పాల్గొన్నారు.

పిఒ, ఎపిఒలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

సార్వత్రిక ఎన్నికల విధులను పిఒలు, ఎపిఒలు అప్రమత్తంగా ఉంటూ సక్రమంగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివి రమణ సూచించారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద జియ్యమ్మవలస, కొమరాడ మండలాల పిఒ, ఎపిఒలకు ఎన్నికల విధులపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎంల వినియోగం, నిర్వహణ, వివి ప్యాడ్స్, మార్క్ కాపీ వాడకం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. పోలింగ్ రోజున ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా విధులు నిర్వహించేందుకు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కురుపాం నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాలకు గానూ 39 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని ఆయా కేంద్రాల పరిధిలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో 683 మంది పిఒలు, ఎపిఒలను నియమించడం జరిగిందని, ఎన్నికల విధులపై వారికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1,788 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎన్నికల విధుల్లో మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి - పాలకొండ

రానున్న ఎన్నికల విధుల్లో ప్రత్యేక కేటగిరి ఉపాధ్యాయులకు మినహాయింపులు ఇవ్వాలని ఎపిటిఎఫ్ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాసపు వాసుదేవరావు, గోగుల సూర్యనారాయణ ఎఆర్ఒ కె.వరహాలుకు వినతిని అందజేశారు. కేడర్ వారీగా ఉపాధ్యాయులకు ఎన్నికలు బాధ్యతలు అప్పగించాలని, మహిళా ఉపాధ్యాయులకు ఎపిఒ, ఒపిఒలుగా నియమించారని, వీరిలో గర్భిణులకు, బాలింతలకు, అనారోగ్యానికి గురైన ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు నుండి మినహాయింపు కొరకు ప్రత్యేక సెల్ ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మే నెలకు ఆరు నెలల ముందు పదవి విరమణ చేయుచున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరడం జరిగింది. వినతిని అందజేసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు బివి రమణ, జిల్లా కార్యదర్శి కె.పద్మజ, సభ్యులు జి.రామ్మోహన్, బి.నాగమణి, రామలక్ష్మి, నాయకులు జి.జయలక్ష్మి, జె.భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

ప్రిజం-10పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రిజం-10పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బగాది జగన్నాథరావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. ఎఎన్ఎంలకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చొరవ చూపాలన్నారు. ఎండలు అధికంగా ఉండడం వల్ల వడదెబ్బలు తగిలే అవకాశం ఎక్కువగా ఉందని, వాటికి సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వీలైనంత మేరకు గ్రామస్థాయిలో వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మందులు స్టోర్ రూమ్, సిబ్బంది రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి, ఇఒ కె.జనార్దన్‌రావు, సూపర్వైజర్ ఓ.శాంతి కుమారి, డిఇ యోగేశ్వర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



గిరిజనులు సాగు చేస్తున్న పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

పెదరామలో ఆరోగ్య పోషణ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెదరామలో ప్రకృతి వ్యవసాయ విభాగ రీజనల్ అధికారి కృష్ణారావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగ డిపిఎం షణ్ముఖరాజు ఆధ్వర్యంలో ఆరోగ్య పోషణ్ కార్యక్రమం ఫుడ్ బాస్కెట్ ప్రారంభించారు. ఇందులో భాగంగా రీజనల్ అధికారి, డిపిఎం ఆరోగ్య పోషక విషయంపై గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు అలాగే అందరికీ ఎలా ఉపయోగపడుతుందనే విషయంపై వివరించారు. ఆ తర్వాత అదే గ్రామంలో ఎన్.శ్యామసుందర్రావు రైతు వేసిన ఎటిఎం మోడల్‌ను పరిశీలించి అందులోని లోటుపాటులను గుర్తించి రైతులకు వివరించారు. అలాగే దిగుబడి, వచ్చిన ఆదాయ వ్యయాల కోసం అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత దోనుబాయి యూనిట్ బూర్జలో జీల్లకర్ర మధుసూదనరావు రైతు వేసిన పలు పంటలు మోడల్ సందర్శించి దిగుబడి, ఆదాయ వ్యయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అందులో ఉన్న లోటుపాట్లను గుర్తించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమానికి మార్కెటింగ్ ఎన్ఎఫ్ఎ తిరుపతి, ఐటిడిఎ ఎన్ఎఫ్ఎ ముసలయ్య, హెచ్ఎన్ ఎన్ఎఫ్ఎ శోభారాణి, డివిజన్ ఎంఎఫ్‌టి బాలు, ఎన్ఎఫ్ఎఫ్ స్వప్న, మండల్ యాంకర్ సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జిలు నరేష్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కన్నంపేటలో విద్యుత్‌షాక్‌కు గురైన మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం కన్నంపేటకు చెందిన చీపురుపల్లి ఉమామహేశ్వరరావు (45) బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన పెళ్లి మండపం పనులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.